
దీపావళి కథల పోటీలో
కన్సొలేషన్ బహుమతి
పొందిన కథ

# ఆ దృశ్యం చెదరి పోనీయకు

అతి తక్కువ సమయంలో మంచి పేరు ప్రఖ్యాతులు పొందిన వ్యక్తి డా॥ రవి. సైకియాట్రిస్ట్‌గా ఆయన తీసుకునే ఫీజు కూడా నామమాత్రమే. అలా కూడా జనం హృదయాల్లో ఒదిగిపోయాడు.



ఒక స్వచ్ఛంద సంస్థ రవికి పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఆరోగ్య శాఖ మంత్రిగారి చేతుల మీదుగా ఆ గౌరవ పురస్కారం రవికి దక్కబోతోంది. పట్టణంలోని సైకియాట్రిస్టులందర్నీ పిలిచి వేదిక ఏర్పాటు చేసారు. డాక్టర్ రవి మీదున్న అభిమానంతో జనం కూడా బాగా పోగయ్యారు.

సన్మాన ఘట్టం ముగియగానే తనకి అత్యవసర కాన్ఫరెన్స్ ఉందని, తన సందేశం అందించి మంత్రివర్యులు హుటాహుటిన వెళ్లిపోయారు.

డాక్టర్ రవిని మాట్లాడమని కోరారంతా.

హుందాగా లేచి నిలబడిన రవి చెరగని

చిరునవ్వుతో మైకు ముందుకు చేరి గొంతు సవరించుకున్నాడు. ఆహుతులంతా నిశ్శబ్ధమై పోయారు.

అందరికీ వందనం!

నేడు జనజీవన శైలి మారింది. జీవితంలో ఎదగాలనే తపన పెరిగిపోయింది. ఆ ప్రయత్నంలో మనిషి మానసిక సంఘర్షణకు లోనవుతున్నాడు. ఇటువంటి మానసిక సంఘర్షణే నేటి మానవుడి అసలు సమస్యవుతోంది.

ఆధునిక జీవనం మనకు తెలియకుండానే మానసిక వ్యాధులను మోసుకొస్తోంది.

భారతదేశంలో మధుమేహం, గుండె జబ్బుల తర్వాత అధిక సంఖ్యాకుల్ని పట్టి పీడిస్తున్నవి మానసిక సమస్యలే. మన రాష్ట్రంలోనైతే మానసిక వ్యాధులతో బాధపడుతున్నవారి సంఖ్య ఎనభై లక్షలకు పైనేనని ఒక సర్వేలో తేలింది. వీరిలో ఎనభై శాతం విద్యావంతులే కావడం గమనించాల్సిన విషయం. ఈ సందర్భంగా మీకొక కథ చెబుతాను.

ఇది నిజ జీవిత కథ. అందరికీ అవసరమయ్యే కథ... అంటూ కొన్ని క్షణాలు ఆగి, తిరిగి చెప్పసాగాడు. చక్కని కథలు చెప్పి పేషంట్స్‌ని మారుస్తుంటాడాయన.

* * *


వర్షం సన్నగా కురిసి కాసేపట్లో వెలిసింది.

తడిసిన నేలంతా అమ్మ చేతిలోని పెరుగన్నపు ముద్దలా అయింది.

ఎనిమిదేళ్ల తేజ చిట్టి పొట్టి చేతుల్లో థర్డ్‌క్లాస్ రీడరైతే ఉంది కాని, వాడి చూపంతా బయటి వైపే. కిటికీ నుంచి తొంగి తొంగి చూస్తున్నాడు... పంజరంలోని పక్షి కూనలా. వాడి ధ్యాసంతా ఆటపైనే. ఎంచక్కా ఆడుకోవాలనే. అపుడపుడూ వర్షంలో తడుస్తూ ఆడుకోవడమంటే సరదా వాడికి.

ఈ టైంలో నాన్న బయటికి వెళ్తే బావుణ్ణనుకున్నాడు. తథాస్తు దేవతలుంటారంటారుగా... అలా అనుకున్నదే తడవు ఆ అబ్బాయి కోరిక నిజమైంది.

వర్షం ఆగిపోగానే రామ్మూర్తి డ్రెస్ వేసుకొని



**ఎనుగంటి వేణుగోపాల్**

బయటికెళ్ళి పోయాడు.

క్షణమాలస్యం లేకుండా తేజ బుక్‌ని టీపాయ్ మీద పడేసి రెక్కలు వచ్చినట్టు రివ్వున బయటికెగిరిపోయాడు. మట్టిలో మట్టితో ఆడుకోవడమంటే భలే ఇష్టం వాడికి. నాన్నగారేమో చీవాట్లేస్తారు.

'మురికి వెధవలా ఏమిటా పిచ్చాటలు?' అంటూ తెగ కోపం చేస్తారు.

అమ్మేమో మంచిది. "బాలకృష్ణుడే బాల్యంలో మట్టి తిన్నాడు. మట్టితోనే కదండీ మనిషికి అనుబంధం. మట్టి తినని శైశవం, మట్టితో ఆడని బాల్యం ఉంటుందా?" అంటూ భలేగా వెనకేసుకొస్తుంది.

నాన్న వినరు. ఆయనకవేం పట్టవు. ఎదుటివారి ఇష్టాయిష్టాలతో పన్లేదు. చదువు... చదువంటూ అస్తమానం పోరుపెడతారంతే.

"పక్కింటి వివేక్‌గాడు చూడు... ఎప్పుడూ ఫస్టొస్తాడు" అంటూ వాడితో పోలుస్తారు. తేజకది నచ్చదు.

తండ్రి అలా అనేసరికి. రోషం పెన్సిల్ మొనలా పొడుచుకొస్తుంది.

తేజ క్లాసులో వీకేం కాదు. ఫిఫ్త్ లోపు ర్యాంక్ వస్తూంటుంది. కానీ ఫస్ట్ రావడం మాత్రం కష్టమవుతోందా కుర్రాడికి.

నాన్నేమో "ఫస్ట్ రానపుడు వేస్ట్" అంటూ విసుక్కుంటుంటారు. బాధొస్తుంది. చిన్న పిల్లాడు కదా... ఏమంటాడు? పేపర్ రేపర్‌లో దాగిన చాక్లెట్‌లా ముడుచుకుపోతాడంతే.

ఆకాశంలో గుమిగూడిన రకరకాల గాలిపటాల్లా ఒకేచోట చేరిన పిల్లల చెంతకు చేరాడు తేజ. ఉత్సాహంగా ఆ గుంపులో కలిసిపోయాడు.



## రచయిత పరిచయం

ఎనుగంటి వేణుగోపాల్ ఉద్యోగరీత్యా జగిత్యాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్సెస్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఎమ్మే-లిట్ చేసిన వీరి కథలు 80 వరకూ వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. 'ఆంధ్రభూమి'లో ఒక సీరియల్ వచ్చింది. 'అమ్మానాన్న', 'గోపాలం' అనే రెండు కథాసంపుటాలు వెలువడ్డాయి. తండ్రి శ్రీ రాజమల్లయ్య తెలుగు పండితులు కావడంతో తనకూ తెలుగు సాహిత్యంపై మక్కువ ఏర్పడిందని చెబుతున్న వేణుగోపాల్ గారి 'అమ్మానాన్న' కథ సంపుటిపై పరిశోధనా గ్రంథం వెలువడబోతోంది. కథలే కాక వీరు అనేక కవితలు, వ్యాసాలు, జోక్స్ కూడా వ్రాసారు.

తేజ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు.

అయిదు నిమిషాలు అలా గడిచాయో లేదో దూరాన్నుండి స్కూటర్ శబ్దం వినబడింది.

"ఆ స్కూటర్ శబ్దం నాన్నగారిదే. వేల శబ్దాల మధ్యనైనా ఆ సౌండ్‌ని ఇట్టే గుర్తుపట్టొచ్చు. అప్పుడే రారనుకుంటే వెంటనే తిరిగొచ్చాడేంటబ్బా! ఆలోచిస్తూనే మంచు మీద స్కేటింగ్ చేసినంత వేగంగా వెనుదిరిగాడు తేజ.

బాత్రూమ్‌లో దూరి, బురదంటిన కాళ్ళను గబగబా కడిగేసుకున్నాడు. ఏమీ ఎరగని వాడిలా ఎప్పట్లా పుస్తకం పట్టుక్కూర్చున్నాడు.

తండ్రి లోనికి వచ్చాడు.

రామ్మూర్తి వాడిచూపులు వేడివేడిగా కొడుకు

మీద పడనే పడ్డాయి.

"మళ్లీ గది దాటావా?" తేజ వైపు గుడ్లు రుమి చూసాడు.

"లే...లేదు నాన్నా! రీడింగ్ చేస్కుంటున్నా" భయాన్ని కప్పేసుకుంటూ బదులిచ్చాడు.

వెధవా! నీ మోకాలు కంటిన బురదే చెప్తోం ది. పైగా అబద్ధాలు కూడానా!" రుసరుస లాడాడు.

"ఛఛ! హడావుడిలో సరిగ్గా చూసుకోలేదు. ఇప్పడిలా దొరికిపోయా" తనలో తానే గొణు క్కుంటూ తలొంచుకున్నాడు.

వేడి సోకి కరిగిపోతున్న ఐస్‌క్రీమ్‌లా అయింది తేజ వాలకం. పని హడావిడిలో వదిలేసాడు కానీ... "వాడు ఆడుకోవడానికెళ్తే ఇంట్లో నువ్వేం చేస్తున్నావంటూ" తల్లీ కొడుకు లిద్దర్నీ కలిపి మరీ క్లాసు పీకేవాడు.

చెప్పినట్లు వినకపోతే వీరంగం చేసే రకం రామ్మూర్తి. అందుకే భర్త నైజం తెలిసి కలుగ జేసుకోలేదు సుమిత్ర. తలూపడం తప్ప ఎదురు వాదించదామె.

* * *

ఆ రోజు ఆదివారం.

ఉదయమనగా ఇల్లు దాటిన తేజ చీకటి వేళ ఇంటికి చేరాడు.

హాల్లోనే ఎదురుపడిన తల్లి "ఎక్కడి కెళ్లావు చిన్నా?" ఆత్రంగా అడిగింది.

"క్రికెట్ మ్యాచ్ జరిగిందమ్మా!" బదులి చ్చాడు.

"మధ్యాహ్నం భోంచేయలేదు" గుర్తుచేసింది సుమిత్ర.

"అక్కడే టిఫిన్ చేసానమ్మా" చెప్పాడు.

"లేటవుతుందని చెప్పి వెళ్లాచ్చుగా?" చిరు కోపం ధ్వనించినా అనురాగం రాగమైందా తల్లి గొంతులో.

"కాసేపు ఆడివద్దామనుకొన్నాను. వెళ్లాక తెల్సింది... ఫ్రెండ్స్ వేరే కాలేజి వాళ్లతో మ్యాచ్ ఫిక్స్ చేశారని. సారీ మమ్మీ!" నొచ్చుకున్నాడు తేజ.

సుమిత్ర పెదవి విప్పబోయింది.

అక్కడే ఉన్న రామ్మూర్తి భార్యకా ఛాన్సివ్వ లేదు. తను కలుగజేసుకున్నాడు.

"నీకీ క్రికెట్ దురదేంట్రా? గేమ్స్ పిచ్చి మన ఇంటావంటా లేదు" పెళుసుగా అన్నాడు. ఆయ న మాట తీరే అంత. సౌమ్యత మచ్చుకు కాన రాదు.

ఆ కాలంలో పైచదువులు చదువుకుంటా నంటే పెట్టుబడి పెట్టేంత స్తోమత తన తండ్రికి లేదు. వీడినైనా బాగా చదివిద్దామంటే తనకను గుణంగా ఉండడంలేదు అనే బాధ రామ్మూర్తిది.

తల్లి వెనకాలే మెల్లగా కిచెన్‌లోకి జారుకుం టున్న తేజ తండ్రి మాటలకు మంత్రజలం తగలగానే శిలలా మారిన రాకుమారుడిలా... చప్పున ఆగిపోయాడు.

"సండే కదా ఆడుకున్నాను" మృదువుగా పలికాడు.

"సెలవైతే ఆడుకోవడమేనా? తాటిచెట్టులా పెరగ్గానే సరిపోదు. మెదడు పెరగాలి. మేధస్సు పెంచుకోవాలి. జులాయిలా పొద్దస్తమానం తిర గడం కాదు" అంటూ విరుచుకుపడ్డాడు.

వాడిన పూవులా తేజ తలొంచుకున్నాడు. మౌనం తప్ప మాట్లాడకపోవడం బెటరని తెలు సతనికి.

"టెన్త్‌లో ఫైఫిఫ్టీ ఎక్స్‌పెక్ట్ చేసా. ఫైటెన్

దాటలేకపోయావు. మా కొలీగ్స్ ముందు ఎంత నామోషీగా ఫీలయ్యానో తెలుసా? ఇంటర్‌లో నైనా హార్డ్‌వర్క్ చేస్తావేమోఅంటే బలాదూర్ తిరుగుతున్నావు, ఆడుతున్నావు. ఇంట్లో ఉంటే టీవీ చూడ్డం. పొద్దస్తమానం ఈ వ్యాపకాలతోనే సరిపోతోంది నీకు".

తేజ ఉలక లేదు, పలక లేదు.

"ఛఛ! గొడ్డుకో దెబ్బ, మనిషికో మాట అన్నారు. ఎంత అరిచినా చెవికెక్కించుకోవేంట్రా?" అనాలనుకున్నవన్నీ ఏకబిగిన వదిలేసాడు.

"దీనికన్నా తన్నులు బెటర్. మరిచిపోవచ్చు. కానీ నాన్న అదేపనిగా క్లాసు పీకుతాడు. ఈ మెంటల్ టార్చర్ భరించలేకుండా ఉంది. గాట్లు పడకుండా తూట్లు చేసేస్తాడు నాన్న. ఎవరికో నైంటీ పర్సెంటేజ్ వచ్చి తనకి రాకపోతే కోప్పడడం దేనికో? ఎవరి టాలెంట్ వారిది. బుర్ర వేడెక్కిపోతూంటే ముఖం చిన్న బుచ్చుకున్నాడు తేజ.

"ఏమన్నా కొయ్యలా బిగుసుకుపోవడం తెలుసు... ఈ కాంపిటీషన్ యుగంలో ఎలా చదవాలో, ఎంతెలా చదవాలో నీతలకెక్కడం లేదింకా. నీలాంటి వాడికి తిండి దండగ. అడిగినవి మాత్రం అన్నీ కొనిపెట్టాలి నీకు" రామ్మూర్తి ఊగిపోతూనే –

"వెళ్లు... వెళ్లి భోంచెయ్! తిన్నాకయినా కాస్త పుస్తకం పట్టుకొని కుదురుగా కూర్చో" ఆయన స్వరం అనవసరంగా తీవ్రస్థాయికి చేరింది.

తండ్రి అక్షింతలు చల్లుతున్నంతసేపూ ఊపిరి సైతం పీల్చడం మరచిన తేజ అక్కడి నుండి కదలబోతూంటే తిరిగి విన్పించాయి తండ్రి మాటలు...

"ఇక్కడుంటే చేతికి అందేట్టులేవు. మొన్ననేగా కాలేజ్ స్టార్టయింది... ఇక్కడి కాలేజ్ నుండి తీసేసి కార్పొరేట్ కాలేజీలో చేర్పిస్తే సరి... హాస్టల్‌లో ఉంచితే చచ్చుకుంటూ చదువుతావు. ఈ తిరుగుళ్ళు ఉండవు, పిచ్చి పిచ్చి ఆటలూ సాగవు" అనేసి తన పనిలో నిమగ్నమయ్యాడు.

* * *

రామ్మూర్తి అన్నంత పనీ చేసాడు.

"వద్దు నాన్నా! ప్లీజ్... ఎక్కడో పొరుగూర్లో చదవడం నాకిష్టం లేదు" అంటూ తేజ మొత్తుకున్నా తండ్రి విన్లేదు.

జగిత్యాల నుండి తీస్కెళ్లి హైద్రాబాద్ కార్పొరేట్ కాలేజీలో చేర్పించాడు. తనెంత తెలివిమాలిన పని చేసాడో అపుడు రామ్మూర్తికి అర్థం కాలేదు.

ఇంట్లో రోజంతా బద్ధకంగా కూర్చొని కష్టపడి రాసిన నోట్స్‌నిండా తప్పులేనని స్కూల్‌కి వెళ్లాక దాన్ని చెక్ చేసిన మాస్టారు మందలిస్తే... తిరిగి అణకువగా నోట్స్ రాసుకోవడం మొదలుపెట్టిన విద్యార్థి మాదిరి అయింది రామ్మూర్తి పరిస్థితి.


ఎలాగంటే –

* * *

తండ్రి దురుసు మాటలు మైండ్‌లో రివైండయినప్పుడల్లా డిస్టర్బ్ అయ్యేవాడు తేజ. "ఇంటర్‌లో నైన్ ఫిఫ్టీకి తగ్గొద్దు' అంటూ తండ్రి వెళుతూ వెళుతూ చేసిన హెచ్చరికలు అతడి చెవుల్లో మార్మోగేవి.

ఏ అర్ధరాత్రో అపరాత్రో ఉలిక్కిపడి నిద్ర లేచేవాడు. తిరిగి ఓ పట్టాన నిద్ర పట్టేది కాదు. నలిగి పోయేవాడు.

పర్యవసానం –




క్లాసులో కునికిపాట్లు... లెక్చరర్ల అవహేళన... తోటి విద్యార్థులతో పోటీ పడలేక, హాస్టల్ వాతావరణంలో ఇమడలేక, నిత్యం సతమతమయ్యేవాడు.

వీటికి తోడు హోమ్‌సిక్! పదే పదే అమ్మ గుర్తుకొచ్చేది.

"చిన్నా, తిండి సరిగా తినరా, నీ ఆరోగ్యం జాగ్రత్త నాన్నా!" అంటూ ఆప్యాయతతో హత్తుకొని నుదుటిన ముద్దాడిన అమ్మ రూపం కనుల ముందు నిలిచేది.

సాంత్వన పొందడానికి అమ్మతో మాట్లాడే వీలు లేదు: తల్లిదండ్రులు పిల్లల్తో ఫోన్ కాంటాక్ట్ చేయకూడదు.

పుస్తకాలు చుట్టూ పిల్లలు గడియారపు ముల్లులవ్వాలి.

ఇంటి ధ్యాస... తండ్రి పదజాలం... తేజ మనసుని అల్లకల్లోలం చేయసాగాయి.

మనసు పోటెత్తింది. ఫలితం...

తేజ అంతరంగం సంక్షోభమయమయ్యింది. తీవ్ర డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయాడు.

మూడు నెలలుగా కాలేజీలో ఎవరితోనూ ఒక్కమాట మాట్లాడకుండా... అంతర్వర్తనుడై... మౌనముద్ర దాల్చాడు. విషయమేంటో లెక్చరర్స్‌కి బోధపడలేదు. ఆరా తీసినా ఆ అబ్బాయి ఆంతర్యం వెల్లడికాలేదు. విధిలేక రామ్మూర్తిని పిలిపించి తేజని ఇంటికి పంపేసారు.

కొడుకు మౌనస్థితి, మానసిక పరిస్థితిని గమనించకుండా రామ్మూర్తి ధోరణి యధావిధిగానే కొనసాగింది. "నీ ఫీజు కోసం వేలకు వేలు కట్టాన్రా. డబ్బంతా నేలపాలు చేసావు కదరా!" అంటూ వాపోయాడు.

అదిగో అప్పుడు...

తేజలో మానసిక ఒత్తిడి మరింత తీవ్రతరమయ్యింది.

అతడి చూపులు, వాలకం, నవ్వులు, మాట తీరు తల్లిదండ్రులు గుర్తించే సమయానికి సమస్య జటిలమయింది.

మేధస్సు వేటకు పసి మస్తిష్కం బలి అయింది!

భోరుమని విలపిస్తూ మానసిక వైద్యుడిని ఆశ్రయించారా తల్లిదండ్రులు. చికిత్స ప్రారంభమైంది.

*　*　*

డాక్టర్ రవి చెప్పడం ఆపాడు.

"ఆ కుర్రాడికిప్పుడెలా ఉంది?" ఉత్సుకతతో అడిగారెవరో సభలోంచి.

"సంపూర్ణంగా ఆరోగ్యవంతుడయ్యాడు. అతనికి ఇష్టమైన చదువు చదివాడు. సమాజం గర్వించేలా ఎదిగాడు. నిజానికీ కథ జరిగి దాదాపు పదిహేను సంవత్సరాల కాలం గడిచిపోయింది" అలుపెరుగని చిరునవ్వుతో బదులిచ్చాడు రవి.

"ఆ అబ్బాయి ఇప్పుడేం చేస్తున్నాడు?" లేచి మరొకరు ప్రశ్నించారు. చేత్తో సైగ చేసి ఆయన్ని కూర్చోమన్నాడు.

"ఆ కుర్రాడిపుడు మనో వైకల్యాలను నయం చేసే మానసిక వైద్యుడయ్యాడు. ప్రస్తుతానికి ప్రత్యక్షంగా మీ ముందే నిలబడి ఉన్నాడు.

ఆ అబ్బాయి... తేజ ఎవరో కాదు...

నేనే!

రవిని – రవితేజని!!

ఒక విస్మయపు తరంగచలనం... విస్ఫోటపు కెరటమై... ఉవ్వెత్తున ఎగిసిపడి... అక్కడి వారి తీరాల్ని ఢీ కొన్నట్టయ్యింది.

సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారంతా.

చప్పట్లు మార్మోగుతూంటే డాక్టర్ రవితేజ తిరిగి కొనసాగించాడు తన ప్రసంగాన్ని...

"ఒక సైకియాట్రిస్ట్‌గా సభాముఖంగా నే చెప్పదల్చుకున్నదొక్కటే!

బాల్యాన్ని రక్షించండి. పిల్లల్ని ఇష్టపడి చదవనీయండి. కష్టపెట్టకండి. కేవలం చదువే జీవితమనే భ్రమ కల్పిస్తూ, ఒత్తిడి తేకండి. ర్యాంకులంటూ రాపిడి చేయకండి. నచ్చిన రంగంలో ఎదగమని ప్రోత్సహించండి. ఎలా జీవిస్తే సమాజంలో ఉన్నతంగా ఉంటామో విశ్లేషణ చేయండి. మానవీయ విలువల్ని అందించండి. రాత్రనక, పగలనక చదివితే స్కూల్లో ఎక్కువ మార్కులు పడతాయేయో గానీ... మానవతా విలువల్తో జీవిస్తే... సమాజంలో మంచి మార్కులు పడతాయి.

పిల్లలకు తెలిసే రీతిలో, అర్థమయ్యే పద్ధతిలో చెబితే సరిపోతుంది. హర్ట్ చేస్తే ముక్కలయ్యేది పసిహృదయాలేకాదు... పెద్దల మనసులు సైతం కలత చెందుతాయి.

అందుకే –

చిన్నారుల గుండె సవ్వడిని ప్రేమగా ఆలకించండి!

బాల్యం ఒక మధురస్మృతి – దాన్ని గాయపరచకండి.

బాల్యం ఒక అపురూపదృశ్యం – మనసు పొరల్లోంచి దానిని చెదరనీయకండి" అంటూ ముగించాడు.

సభికులతో పాటు అక్కడున్న సైకియాట్రిస్టులు సైతం ఆలోచనా సంద్రంలో మునిగిపోయారు. ●